ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 5 సెప్టెంబరు 2024



నకిలీ పట్టాల కేసు కంచికేనా..?

- ఆక్రమణలు, నకిలీలకు చెక్‌పడేనా
- బద్వేలులో భూభాగోతంలో తెరవెనుక ఉన్నది ఎవరు
- కూటమి ప్రభుత్వంలో అయినా వెలుగులోకి వచ్చేనా

బద్వేలులో భూ భాగోతం రెండేళ్ల క్రితం వెలుగులోకి వచ్చింది. అప్పట్లో వైసీపీ నేతలు, రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై డీకేటీ, పట్టా భూములకు సైతం నకిలీ పట్టాలు సృష్టించి విక్రయాలు సాగించారు. కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకున్నారు. దీనిపై ఆర్డీవో దృష్టిసారించడంతో 17 మందిపై కేసు నమోదైంది. నిందితుల నుంచి పెద్ద ఎత్తున నకిలీపట్టాలు స్వాధీనం చేసుకున్నారు. తర్వాత ఈ కేసు మరుగున పడిపోయింది. బద్వేలులో భూ ఆక్రమణలపై తాజాగా కూటమి ప్రభుత్వం చర్యలకు దిగింది. ఈ నేపథ్యంలో నకిలీపట్టాల కేసుపైనా దృష్టిసారించి నిందితులకు శిక్షపడేలా చేయాలని బాధితులు కోరుతున్నారు.



గతంలో నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ పట్టాలు, రబ్బరు స్టాంపులు (ఫైల్‌ఫోటో)

బద్వేలు టౌన్, సెప్టెంబరు 4: బద్వేలు పట్టణం నానాటికి విస్తరిస్తోంది. చుట్టూ గ్రామీణ ప్రాంత ప్రజలు తమ పిల్లల చదువుల కోసం, వృత్తి, వ్యాపారాల రీత్యా బద్వేలు పట్టణానికి వచ్చి నివాసం ఉంటున్నారు. దీంతో స్థలాల ధరలకు రెక్కలు వచ్చి డీకేటీ భూములు కూడా లక్షల రూపాయలు పలుకుతున్నాయి. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో డీకేటీ భూములకు నకిలీ పట్టాలు తయారుచేసి, విక్రయించి భూ వివాదాలకు తెరలేపారు. భూ మాఫియా గ్యాంగ్ బద్వేలులో ప్రభుత్వ స్థలాలను, పేదల భూములను నకిలీ పట్టాలతో ఆక్రమించిన తీరు అప్పట్లో జిల్లాలో కలకలం రేపింది. ఈ వ్యవహారంలో కొందరు వైసీపీకి చెందిన నేతలు ప్రధానంగా ఎన్జీఓ కాలనీలో నకిలీ పట్టాలు పుట్టించి కోట్లరూపాయల సొమ్ముచేసుకున్నట్లు సమాచారం. బద్వేలు రెవెన్యూ డివిజన్ అయిన తరువాత మొదటి ఆర్డీవో ఆకుల వెంకటరమణ నకిలీ పట్టాలపై ఉక్కుపాదం మోపడంతో ఈ వ్యవహారం గుట్టురట్టు అయింది. నకిలీ పట్టాల తయారీలో కీలక సూత్రధారులు, పాత్రధారులపై మెరుపుదాడులు నిర్వహించారు. చాలా వరకు ఆధారాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో పోలీసుశాఖ కూడా హడావిడి చేసి 17 మందిపై కేసు నమోదు చేసింది. అయితే కొందరిని మాత్రమే అరెస్ట్‌చేశారు. మరికొందరు వైసీపీకి చెందిన వారు కావడంతో వారిపై కేసులు నమోదు చేయలేదు. భూకబ్జాలు వెలికితీసి, నకిలీల గుట్టు రట్టుచేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన తీరు జిల్లాలోనే సంచలనంగా మారారు. అప్పట్లో అడ్డూ అదుపులేకుండా సాగిన బద్వేలు భూదందాపై ఇటు పోలీసు, అటు రెవెన్యూ శాఖలు చేపట్టిన చర్యలపై ప్రజల్లో సర్వత్రా హర్షం వ్యక్తం అయింది.

పెద్దల బండారం బయటపడలేదు

నకిలీ పట్టాలతో భూ ఆక్రమణలకు సంబంధించి బద్వేలులో వైసీపీకి చెందిన పెద్దల బండారం బట్టబయలు అవుతుందని అందరూ ఎదురుచూశారు. అయితే ఏమైందో ఏమో .. ఈ వ్యవహారం వెలుగుచూసి రెండేళ్లు అవుతున్నా నకిలీపట్టాల కేసు గప్‌చుప్ అయింది. నకిలీ దందా నడిపే పాత్రధారులపైన మాత్రమే చర్యలు తీసుకున్నారు తప్ప, ఈ దందా వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనేది ఆరాతీసి అరెస్ట్ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ నకిలీ పట్టాల భూ దందాపై పోలీసుకేసులు నమోదు చేసినా ఏడుగురిని మాత్రమే అరెస్ట్ చేశారు. మిగిలిన 10 మంది వైసీపీ నాయకులు కావడంతో వారిపై కేసు నమోదు చేసినా అరెస్టు చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. బద్వేలు పట్టణంలో గత పదేళ్లుగా నకిలీ పట్టాలతో భూ వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. గత ఐదేళ్లలో ఇవి మరింత తీవ్రం అయ్యాయి. దీని వెనక బద్వేలు నియోజకవర్గానికి చెందిన వైసీపీ ముఖ్యనేతకు కావలసిన వారు ఉండటంతోనే పోలీసులు, రెవెన్యూ వారు ఈ కేసును పట్టించుకోలేదనే విమర్శలున్నాయి.



భూ వివాదాలకు కారణమైన స్థలాలు

డొంక కదలలేదు

ఏదైనా కేసుల్లో చిన్న క్లూ దొరికితేచాలు, దాన్ని శోధించి కలుగులో ఉన్న ఎలుకను పోలీసులు బయటకు తీసిన సంఘటనలు జిల్లాలో అనేకం ఉన్నాయి. బద్వేలులో రెండేళ్ల క్రితం వెలుగు చూసిన నకిలీ పట్టాలకు సంబంధించిన కేసులో.. ఎస్సీ ఎస్టీ, బీసీ కులాలకు చెందిన వారిని మాత్రమే అరెస్ట్ చూపించారు.. ప్రముఖుల పేర్లు బయటకు వచ్చినప్పటికీ వారి అక్రమాల వ్యవహారం బయటకు పొక్కనివ్వకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం మారింది, అధికారులు మారారు. ఇప్పటికైనా నకిలీపట్టాల కేసును పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని దీని వెనక ఉన్న అసలు వ్యక్తులను బయట పెట్టాలని బద్వేలు ప్రజలు కోరుతున్నారు. నకిలీపట్టాల కేసుకు సంబంధించి బద్వేలు అర్బన్ సీఐ రాజుగోపాల్ యాదవ్‌ను వివరణ కోరగా.. తాను నూతనంగా బాధ్యతలు చేపట్టానని, త్వరలోనే నకిలీ పట్టాల కేసుపై విచారణ చేస్తామని అన్నారు.

కడప-బెంగళూరు రైల్వే పనులు పునఃప్రారంభించాలి : తులసిరెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 4: కడప-బెంగళూరు రైల్వే పనులు పునఃప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నేత డాక్టర్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమ ప్రజల సమగ్రాభివృద్ధి కోసం 2008-09 రైల్వేబడ్జెట్‌లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కడప నుంచి రాయచోటి మదనపల్లె మీదుగా బెంగళూరుకు రైల్వే లైను మంజూరు చేసిందన్నారు. నాలుగు దశల్లో పనులు పూర్తిచేయాల్సి ఉండగా మొదటి దశ కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21.80 కి.మీ పూర్తి అయిందన్నారు. 2019లో జగన్ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ నిధులు విడుదల చేయని కారణంగా పనులు నిలిపివేశారన్నారు. దీని బదులుగా 72 కి.మీ పొడవు కలిగిన ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ రైలుమార్గాన్ని మంజూరు చేయాలని 2021 జూన్ 17న జగన్ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారన్నారు. జగన్ రాయలసీమకు తీరని ద్రోహం చేశారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వెంటనే మ్యాచింగ్ గ్రాంట్ నిధులు విడుదల చేసి పనులు పునఃప్రారంభించాలని కోరారు. పనులు త్వరగా పునఃప్రారంభం కాకపోతే వామపక్ష పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని తులసిరెడ్డి హెచ్చరించారు.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఏఎస్పీగా జి.శ్రీనివాసరావు

కడప (క్రైం), సెప్టెంబరు 4: కడప జిల్లా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీగా జి.శ్రీనివాసులును నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న మాసుం బాషా బదిలీ కావడంతో కొన్ని నెలలుగా ఆ స్థానాన్ని ఇన్‌చార్జి అధికారులు పర్యవేక్షిస్తూ వస్తుండేవారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న విజిలెన్స్ అధికారి పోస్టింగ్‌ను శ్రీనివాసరావుతో భర్తీ చేశారు. రెండు మూడురోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

కరుణామూర్తి.. ఆరోగ్యమాత



మరియతల్లి స్వరూపాన్ని చర్చిప్రాంగణంలో ప్రదర్శిస్తున్న విశ్వాసులు

కడప (కల్చరల్) సెప్టెంబరు 4: కరుణకు ప్రతిరూపం ఆరోగ్యమాత అని మెర్సీ డేరీయన్ గురువులు ఫాదర్ జనార్దన్, కడప కరుణాలయం డైరెక్టర్ ఫాదర్ సుధాకర్ కొనియాడారు. ఆరోగ్యమాత ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన బుధవారం నగర రైల్వేస్టేషన్ సమీప ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో వారు దివ్యబలిపూజ నిర్వహించి మరియమాత సందేశాన్ని వినిపించారు. మరియతల్లి బాల్యం నుంచే ప్రేమ, సేవ, జాలి, దయ, కరుణ, సద్గుణాలు పుణికిపుచ్చుకున్నారని అన్నారు. అందుకే ఆమెను దయగల మాతగా విశ్వాసులు కొనియాడుతున్నారన్నారు. కడపలోని కరుణాలయం పేద పిల్లలను అక్కున చేర్చుకుని ఆలనాపాలన, విద్యాబుద్ధులు నేర్పి తద్వారా సమాజానికి ఉన్నతమైన పౌరులుగా అందిస్తున్నామని వెల్లడించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మరియతల్లి స్వరూపాన్ని విశ్వాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో చర్చిప్రాంగణంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాదరావు, ఫాదర్లు బాలశౌరి, విజయరావు, మరియన్న, చైతన్య, పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతాన్ని, వన్యప్రాణులను సంరక్షించాలి

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 4: జిల్లాలోని అటవీ ప్రాంతాన్ని, వన్య ప్రాణులను సంరక్షించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అటవీ, వన్యప్రాణుల సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యాటకులు సందర్శించేలా అటవీ ప్రాంతాల్లో టూరిజం స్పాట్లు గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. అటవీ, రెవెన్యూ అధికారులు సమావేశాల ద్వారా చర్చించాలన్నారు. అటవీ ప్రాంతాన్ని నిర్ధారిస్తూ హద్దులు తెలిసేలా రాళ్లు పాతాలన్నారు. మొక్కలు నాటాలని, నర్సరీలు ఏర్పాటు చేయాలని అందుకు అవసరమైన నీటి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవానికి నగర వనాలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి సందీప్‌రెడ్డి, పులివెందుల, జమ్మలమడుగు ఆర్డీఓలు వెంకటేశ్, శ్రీనివాసులు, డ్వామా పీడీ విజయ్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, డివిజనల్ ఫారెస్ట్ అధికారులు, రేంజర్లు తదితరులు పాల్గొన్నారు.

- కడపలో సత్యా షోరూం ప్రారంభం



కడప నగరంలోని ఎర్రముక్కపల్లెలో సత్యా ఏజెన్సీస్ వారి 30వ బ్రాంచ్ ఏర్పాటు చేశారు. దీనిని బుధవారం బిల్డింగ్ యజమాని బాలభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయనతో పాటు సత్యా ఏజెన్సీ జీఎం సెంథిల్‌కుమార్, ప్రముఖ బ్రాండ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా పురుగు మందుల దుకాణాలు

- నిబంధనలు తుంగలో తొక్కి షాపుల నిర్వహణ
- కల్తీ, బయోకెమికల్స్‌తో దోపిడీ
- పంట దిగుబడి రాక నష్టపోతున్న రైతన్నలు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 4: దేశానికి వెన్నెముకలాంటి రైతన్నలు పంటలు సాగుచేయాలంటే విసుగెత్తి పోతున్నారు. అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతింటున్నాయి. వీటికి తోడు కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, పురుగుమందులతో రైతులను పురుగుల్లా పీల్చిపిప్పి చేస్తున్నారు. వెల్లటూరు, నందిమండలం కేంద్రాలుగా నకిలీమందులు చెలామణి అవుతున్నాయి. పెండ్లిమర్రి మండలం జిల్లాలోనే పూలతోటల సాగుకు పెట్టింది పేరు. ఈ మండలంలో 30వేల ఎకరాల సాగుభూములు ఉండగా రబీ, ఖరీఫ్ సీజన్లలో 14వేల ఎకరాల్లో పంటలు సాగులో ఉన్నాయి. ఉల్లి, మిరప, చామంతి, బంతి పంటలు సాగుచేస్తే ఎకరాకు సాగు పెట్టుబడి లక్ష రూపాయలు అవుతుంది. అన్నిపంటలు కలుపుకొంటే సగటున ఎకరాకు రూ.60వేల చొప్పున లెక్కేసినా రూ.84కోట్లు ఖర్చు అవుతుంది. మారిన వాతావరణ పరిస్థితులు ఇతరత్రా కారణాలతో పంటలకు తెగుళ్లు ఎక్కువగా వస్తున్నాయి. దీనితో రైతులు గడ్డి మందుతో మొదలుపెట్టి దుక్కుల దగ్గర నుంచి పంట చేతికి వచ్చే వరకు దిగుబడి రావాలంటే ఎరువులతో పాటు పురుగుల మందులు వాడాల్సిందే.

పుట్టగొడుగుల్లా

పంటలకు ఆశించే తెగుళ్లను అవకాశంగా వాడుకుని కొందరు వ్యాపారులు పురుగుల్లా మారి రైతులను పీల్చి పిప్పి చేస్తున్నారు. వెల్లటూరు, నందిమండలం కేంద్రాలుగా నకిలీమందులను రైతులకు విక్రయిస్తున్నారు. మండల పరిధిలో అధికారికంగా 25 దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ జరిగే క్రయవిక్రయాలు, స్టాకు వివరాలను వ్యవసాయ అధికారులకు తెలపాల్సి ఉంది. అధికారులు కూడా తరచూ దుకాణాలను తనిఖీ చేసి ఏయే మందులు ఉన్నాయి, రైతులకు ఎలాంటి మందులు విక్రయిస్తున్నారో పరిశీలించడంతో పాటు స్టాకు రిజిస్టర్‌లను తనిఖీ చేయాలి. అయితే వ్యవసాయ అధికారులు ఇటువైపు దృష్టి సారించకపోవడంతో రైతుల అమాయకత్వాన్ని వ్యాపారులు క్యాష్ చేసుకుంటున్నారు. అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా ఊరికో చోట పురుగులు, ఎరువుల దుకాణాలు వెలిశాయి.

తనిఖీలు నామమాత్రమే

దుకాణాల నిర్వహణలో ఒక కంపెనీ ఉత్పత్తిని అమ్మాలంటే ఉత్పత్తి చేసేవారు మండల వ్యవసాయాధికారి ద్వారా ఆన్‌లైన్ చేయించుకోవాలి. కానీ నిర్వాహకులు డీలర్ల వద్ద డైరెక్ట్‌గా కొనుగోలుచేసి అమ్ముతున్నారు. పీడీని జతపరచకుండా అమ్మడం నేరం. అవి ఒకవేళ కల్తీ మందులు అయి ఉండవచ్చు. దీని వలన రైతులు నష్టపోయే అవకాశం ఉంది. దుకాణంలో రిజిస్టర్ తప్పకుండా మెయింటైన్ చేసి ప్రతిరోజు ఏ కంపెనీ ప్రొడక్ట్స్‌ను ఎన్ని అమ్మారో షాపులో స్టాక్ ఎంతుందో రిజిస్టర్‌లో పొందుపరచాలి. ప్రతినెల మండల వ్యవసాయాధికారి రిజిస్టర్లు తనిఖీచేసి సంతకం చేయాలి. బిల్లు బుక్కులో ఏటి చేత సంతకం చేయించి రసీదులను రైతులకు ఇవ్వాలి. ప్రతి షాపులో తప్పకుండా స్టాక్ బోర్డులను ఉంచాలి. మందుల ధరలు, మందుల వివరాలను ప్రతిరోజు బోర్డులో పొందుపరచాలి. కానీ ఇలాంటి నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. తనిఖీ చేసే వ్యవసాయాధికారి, సిబ్బంది కూడా కరువయ్యారు. దీనితో కల్తీ మందులకు డబ్బులు వెచ్చించడంతో పాటు పంట దిగుబడిరాక రైతులు నష్టపోతున్నారు.

నకిలీ పురుగులమందుల దందా

రైతుల ఆర్థిక అవసరాలను కొందరు నకిలీ పురుగుమందుల తయారీదారులు క్యాష్ చేసుకుంటున్నారు. పంట ఏపుగా పెరగడానికి యూరిక్ యాసిడ్ ఉపయోగపడుతుంది. అతి తక్కువకు దొరికే యూరిక్ యాసిడ్ కల్తీచేసి రైతులకు లీటర్ రూ.600కు విక్రయిస్తున్నారు. గడ్డిమందును రాష్ట్రంలో నిషేధించారు. కొందరు వ్యాపారులు తమిళనాడు, కర్ణాటక నుంచి గ్లైఫోసెట్ గడ్డిమందును తీసుకొచ్చి ప్రతి చోటా విక్రయిస్తున్నారు. దీనితో పాటుపలు రకాల కెమికల్స్ కలిపి రకరకాల కంపెనీల పేరుతో కల్తీ మందులను రైతులకు అంటగడుతున్నారు. ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన వ్యవసాయ సిబ్బంది మామూళ్లు తీసుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో పీడపీడల నుంచి పంటలను కాపాడుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం..

మండలంలో ఎక్కడైనా నకిలీమందులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. మండలంలో ఉన్న ప్రతి ఎరువులు, పురుగుమందుల షాపుల యజమానులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడచుకోవాలన్నారు.

సబ్సిడీతో గృహాలకు సోలార్ రూఫ్ : కలెక్టర్



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 4: ఇంటి పైకప్పు మీద సబ్సిడీతో సోలార్ రూఫ్ ఏర్పాటు చేసుకునేందుకు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. దీనికి సంబంధించి బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూంలో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం గృహ వినియోగదారులకి మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా వినియోగ దారులకు ప్రభుత్వం రాయితీ మంజూరు చేస్తుందన్నారు. సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ 1 కిలో వాట్ కింద రూ.30 వేలు, 2కిలో వాట్స్‌కు రూ.60 వేలు, 3 కిలో వాట్స్‌కు రూ.78 వేలు సబ్సిడీని ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఇంటి పైకప్పు పైన 10 చదరపు అడుగుల స్థలంలో 1 కిలో వాట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయవచ్చన్నారు. ఈ పథకానికి తక్కువ వడ్డీకి సుమారు 7శాతం బ్యాంకు రుణాలు లభిస్తాయన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 50 వేల గృహాలకు సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్లు ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లాలో ప్రస్తుతం 97 ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. జిల్లాలో 7 గ్రామాలని ఎంపిక చేసి అందులో 5 గ్రామాల్లో 6 నెలలు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని విస్తృతంగా అమలు చేస్తామన్నారు. అనంతరం పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ పథక పోస్టర్‌ను అధికారులతో కలసి కలెక్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ రమణ, జిల్లా అధికారులు యల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి, ప్రభాకర్, ఆనంద్ నాయక్, లీడ్ మేనేజరు జనార్దన్ పాల్గొన్నారు

బీసీ భవన్ అభివృద్ధికి కలెక్టర్ రూ.6లక్షల విరాళం

కడప బీసీ భవన్ అభివృద్ధికి కలెక్టర్ లోతేటి శివశంకర్ రూ.6 లక్షల విరాళం ప్రకటించారు. స్థానిక పాత రిమ్స్ ఆవరణలోని బీసీ భవన్‌ను బుధవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ భవన్ బీసీలకు ఒక ఆస్తిగా ఉండాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి బీసీ భవన్‌కు వచ్చే వారికి అన్ని సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన ఫర్నీచర్ ఏర్పాట్లు చేయాలని, వాచ్మెన్, కేర్ టేకర్‌ను నియమించాలని సూచించారు. లైబ్రరీ, స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం బీసీ భవన్ అభివృద్ధికి రూ.6లక్షల విరాళం ప్రకటించారు.బీసీ సంక్షేమ అధికారి భరత్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నటరాజ్, ముఖ్య సలహాదారు ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

గురువు పీఠానికి బీటలు

- కేవలం ఉద్యోగిగా మాత్రమే గుర్తింపు
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం



కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 4: సమాజంలో తల్లిదండ్రుల తరువాత ప్రత్యేక స్థానం గురువులదే. వీరు విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారు. అలాంటి గురువుల స్థానానికి బీటలు పడుతున్నాయి. ప్రస్తుతం ఉపాధ్యాయులను కేవలం ఉద్యోగిగానే పరిగణిస్తున్నారు. ఒకప్పుడు గురువు మాటే వేదంగా భావించే విద్యార్థులు నేడు గురువును ఓ బోధన యంత్రాంగంగా మాత్రమే చూస్తున్నారు.

విలువలతో కూడిన విద్యపై చిన్నచూపు

ప్రస్తుతం విద్యార్థుల తల్లిదండ్రుల తీరు మారింది. తమ పిల్లల పట్ల అతి గారాబం వారిని విద్యపట్ల గౌరవభావం లేకుండా చేస్తోంది. మా అబ్బాయిని మందలించి అయినా చదివించండి అన్న తల్లిదండ్రులు నేడు ఎక్కడా కనిపించడంలేదు. మా పిల్లలను శిక్షించే అధికారం మీకు ఎవరిచ్చారని ప్రశ్నించేవారు పెరగడంతో పిల్లవాడికి గురువుపై గౌరవం తగ్గిందని చెప్పవచ్చు. నేడు ప్రతి తల్లిదండ్రి లాభాపేక్ష చదువుల పట్ల మక్కువ చూపుతున్నారే తప్ప తమ పిల్లలకు విలువలతో కూడిన విద్య కావాలని కోరుకోవడంలేదు. సినిమాల ప్రభావం కూడా గురుస్థానాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తోందని గురువులు పేర్కొంటున్నారు. దీనికి తోడు తమ వృత్తి పవిత్రత విషయంలో కొందరు గురువులు చేస్తున్న తీరుకూడా వారి పట్ల సమాజంలో చులకన భావం పెరిగేలా చేస్తోంది.

యాప్‌లతో బోధన సమయం వృథా

విద్యావ్యవస్థ ఇష్టారాజ్యంగా యాప్‌లు సృష్టిస్తుండడంతో విలువైన బోధన సమయం వృథా అవుతోంది. ఉదయం పాఠశాలలో అడుగులు పెట్టింది మొదలు అటెండెన్స్ యాప్, శానిటేషన్ ఫొటోలు కోసం ఐఎంఎస్ యాప్, మధ్యాహ్న భోజనం యాప్.. ఈ లోపు బేస్ లైన్ అసెస్‌మెంటు యాప్, విద్యాకానుకల కోసం మరో యాప్‌తో టీచర్లు కుస్తీ పడుతున్నారు. దీంతో పిల్లల పాఠాల కన్నా యాప్‌లల్లో సమాచారం అప్‌డేట్ చేయడానికి ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. పరీక్షలు జరిగిన ప్రతిసారీ ఫార్మేటివ్, సమ్మేటివ్ మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటూ జారీ చేస్తున్న ఆదేశాల వల్ల బోధన సమయం తగ్గిపోతోంది.

గురువులపై పెరిగిన పర్యవేక్షణ

ఇటీవల ప్రభుత్వ పాఠశాలల మీద పర్యవేక్షకులు పెరిగారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. సచివాలయ సిబ్బంది అయిన ఇంజనీరింగ్ అసిస్టెంటు, వెల్ఫేర్ అసిస్టెంటు, ఉమెన్ పోలీసు, డ్వాక్రా యానిమేటర్లు పాఠశాలలను సందర్శించి ఎన్‌డీఎం అమలు పర్యవేక్షిస్తున్నారు. తమ కన్నా చిన్న చిన్న ఉద్యోగులు తమపై పర్యవేక్షించడం ఏమిటని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. కాగా.. సమాజానికి ఆదర్శప్రాయుడైన గురువు నేడు తమ ఉద్యోగ జీవితంలో సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కడం కొంతమందికి రుచించడం లేదు. సమస్యలు పరిష్కరించాలంటూ రోడ్డు ఎక్కితే అది ప్రభుత్వంపై తప్పుడు ప్రభావం చూపుతుందని భావించిన పెద్దలు ఉపాధ్యాయులకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయడం మొదలుపెట్టారు.

నేడు ఉపాధ్యాయ దినోత్సవం



ప్రతి ఒక్కరి జీవితంలో గురువు చాలా ముఖ్యపాత్ర పోషిస్తారు. ఉపాధ్యాయులు విద్యార్థుల తప్పులు సరిదిద్ది వారి జీవితాలను సన్మార్గంలో నడిపిస్తారు. అందుకే ఉపాధ్యాయులకు ఒకరోజు కేటాయించారు. ఆ రోజే ఉపాధ్యాయ దినోత్సవం. మన దేశంలో ప్రతి ఏడాది సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీ. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జన్మదినాన్ని స్మరించుకుంటూ ఉపాధ్యాయ దినత్సోవం జరుపుకుంటారు. వీరు విద్యారంగానికి విశేష కృషి చేశారు. ఆయన ఉపాధ్యాయుడు, పండితుడు, ప్రఖ్యాత తత్వవేత్త. భారతరత్న పురస్కారం కూడా పొందారు. భారతదేశంలో 1962 నుండి సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

నేడు 79 మంది ఉపాధ్యాయులకు సత్కారం

ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా జిల్లాలో 79 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక చేశారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలోని సభాభవనంలో పురస్కారాలను అందజేస్తారు. మధ్యాహ్నం 2గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈవో ఎం.అనురాధ తెలిపారు.

42 మంది ఉపాధ్యాయులకు సత్కారం



సత్కారం పొందిన ఉపాధ్యాయులతో వైవీయూ వీసీ, ఇంటాక్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 4: ఉపాధ్యాయ దినోత్సవం ముందస్తు వేడుకల్లో భాగంగా కడపలోని మానస ఇన్ సమావేశ మందిరంలో బుధవారం 42 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ముందుగా సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వైవీయూ వీసీ ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యలో విలువలు తగ్గి సాంకేతికత పెరిగిందన్నారు. దీన్ని భర్తీ చేసేందుకు ఇంటాక్ లయన్స్ క్లబ్ సదస్సులు నిర్వహించాలని కోరారు. జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ఈ శ్రీనివాసులు మాట్లాడుతూ నాటి గురువుకు దేశభక్తి, సమాజం పట్ల బాధ్యత ఉండేదని, విద్యార్థి భవిష్యత్తు పట్ల వారికి ఆందోళన ఉండేదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చాక ప్రాథమికవిద్య ప్రాధాన్యత తగ్గిందని, ఉన్నత విద్యకు పునాదులు లేకపోవడం ఆందోళనకరమన్నారు. వైవీయూ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి అభివృద్ధికి గురువు తొలిమెట్టు అన్నారు. అనంతరం 42 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

- విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ముప్పు
- మోటార్లు, స్టార్టర్ల వద్ద జర భద్రం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ప్రమాదం

రైతన్నలూ.. తస్మాత్ జాగ్రత్త

మైలవరం, సెప్టెంబరు 4: ఖరీఫ్ పంటలు ప్రారంభం కావడంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. విత్తనం చల్లిన నాటి నుంచి ఇంటికి పంట ఉత్పత్తులు వచ్చే వరకు పొలాలలోనే రైతులు ఎక్కువ సమయం గడు పుతుంటారు. చాలా గ్రామాలలో రైతులు విద్యుత్ మోటార్లపై ఆధారపడి వివిధ రకాల పంటలు పండిస్తు న్నారు. దీంతో తెల్లవారితే చాలు విద్యుత్ తీగలు, మోటార్ల మధ్యనే పనులు చేస్తూ తిరుగుతుంటారు. ఇక చాలా మంది రైతు లు చిన్నచిన్న విద్యుత్ మరమ్మతు పనులు స్వయంగా చేస్తుంటారు. ఇటువంటి సందర్భాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో మృత్యు వాత పడుతున్నారు. పంట పొలాల్లో స్తంభాల నుంచి కిందకు వేలా డుతున్న తీగల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి.



వేలాడుతున్న విద్యుత్ తీగలతో..

వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాలు దూరంగా ఉన్న ప్రదేశాల్లో కొందరు రైతులు కర్ర స్తంభాలను తాత్కా లికంగా నాటి.. వాటి ద్వారా తీగలు లాగుతుంటారు. ఇవి గాలులు, వర్షాలకు కింద పడి పోతుంటాయి. వాటిని గమనించని రైతులు పనుల్లో నిమగ్నమై తీగలకు తగిలి ప్రమాదాల బారిన పడుతుంటారు. పంట ఉత్పత్తులు ఇంటికి రాగానే పొలం నుంచి విద్యుత్ తీగలు కట్టకట్టి ఇంట్లో భద్రపరుస్తారు. వాటిని కొన్నిసార్లు ఎలుకలు కొరికి వేస్తుంటాయి. అయితే అటువంటి తీగలను పరిశీలించ కుండా తిరిగి మోటార్లకు అమర్చడం వల్ల కూడా ప్రమా దాలు జరిగే అవకాశం ఉంది.



ఇనుప డబ్బాలతో....

స్టార్లర్లు, ఫీజులు బిగించడానికి చాలా మంది రైతులు ఇప్పటికి ఇను ప డబ్బాలు ఉపయో గిస్తున్నారు. ఎలుకలు తీగలను కొరకడంతో డబ్బాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఇది తెలియక రైతులు డబ్బాలను తాకగానే విద్యుత్ ఘాతానికి గురవు తుంటారు. కొంత మంది రైతులు డబ్బాలకు తలుపులు కూడా వేయరు. దీంతో వర్షపు నీరు డబ్బా లలోకి చేరి విద్యుత్ ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుంది.

కవర్లు లేని మోటార్లతో...

చాలా మంది రైతులు మోటార్లను వంక ఒడ్డున, నేల, బావుల పక్కన ఉంచి చిన్న చిన్న కవర్లు కప్పి సాగు నీటికి వినియోగిస్తుంటారు. అవి కొన్ని రోజులకు దెబ్బతింటాయి. తర్వాత వాటిని పట్టించుకోక పోవడంతో మోటార్లతో ప్రమాదం పొంచి ఉంటుంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



మోటారు పనిచేయకపోతే చేతితో దానిని ముట్టుకోరాదు. టెస్టర్ సహా యంతో పరీక్షించాలి. ఎర్తింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. వర్షం నీరు చేరని చోట మోటారును భద్రపరుచు కోవాలి. మోటారు పనిచేయని పక్షంలో విద్యుత్ సరఫరా నిలిపిన తర్వాతే దానిని ముట్టు కోవాలి. ఎప్పటికప్పుడు మోటారు వద్ద తీగలను పరిశీలిస్తుండాలి.

శాస్త్రోక్తంగా కోదండరామునికి పవిత్ర ప్రతిష్ఠ



హోమగుండంలో పవిత్ర ప్రతిష్ఠ చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 4: కోదండరామాలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా మొద టిరోజు బుధవారం పవిత్రాలను హోమగుండంలో ఉంచి పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని టీటీడీ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ ఆగమశాస్త్ర అర్చకులు రాజేష్‌బ ట్టర్ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం స్వామి వారికి నిత్య కైంకర్యాలు నిర్వహించి అనంతరం యాగశాలలో హోమగుండాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారి పవిత్రాలకు ఆగమశాస్త్ర ప్రకారం అర్చకులు పూజలు నిర్వహించారు. స్వామి వారి నిత్య కైంకర్యాల్లో ఆటంకాలు తొలగాలని 101 నూలిపోగు ధరించి స్వామివారి అను గ్రహం కలగాలని అర్చకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు వీణారాఘవాచార్యులు, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, టీటీడీ ఇన్‌స్పె క్టర్ నవీర్, అర్చకులు పాల్గొన్నారు.

హుండీల లెక్కింపుతో గండికి రూ.36లక్షల ఆదాయం



హుండీల లెక్కింపును పరిశీలిస్తున్న అధికారులు

చక్రాయపేట, సెప్టెంబరు 4: గండి క్షేత్రంలో బుధవారం ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో దేవదాయశాఖ సూపరింటెండెంట్ జి.రమణమ్మ అధ్య క్షతన హుండీల లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపుతో రూ.36,48,364 ఆదాయం వచ్చిం ది. అన్నప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.66,317 వచ్చింది. 17గ్రాముల మిక్స్‌డు బంగారం, 2కేజీల వెండి వచ్చినట్లు తెలిపారు. 55 రోజులకు గాను ఈ లెక్కింపు నిర్వహించామన్నారు. ఆర్కేవ్యాలీ ఎస్‌ఐ, సిబ్బంది భాస్కర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, బ్యాంకుమేనేజర్ భానుప్రకాష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై విచారణ

- పోలీసుల అదుపులో 14 మంది జూదగాళ్లు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 4: జూదం ఆడటానికి వచ్చిన అనంతపురం జిల్లా యాడికి గ్రామవాసి కంబగిరి రాముడు (38) ప్రొద్దుటూరులో అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందాడు. దీనిపై ఇతని భార్య ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ బాలమద్దిలేటి ఎస్‌ఐ మహ్మద్ రఫీలు విచారణ చేపట్టారు. అందులో భాగంగా మండల పరిధిలోని కల్లూరు గ్రామ సమీపంలోని పెన్నానది ఒడ్డున రిజర్వ్ ఫారెస్టు స్థలంలో రాముడుతో పాటు మరో వ్యక్తి కారులో జూదం ఆడటా నికి వచ్చినట్లు గుర్తించారు. రాముడుతో పాటు వచ్చిన మరో వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలంలో రాముడు మృతదే హంతో పాటు కారు ఉన్నట్లు గుర్తించారు. రాముడు మృతదేహంపై ఎటువంటి గాయాలు లేకపోవడంపై మృతికి గల కారణాలపై మిస్టరీ నెలకొంది. డాగ్ స్క్వాడ్‌తో కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. గత కొంతకాలంగా వైసీపీ నాయకుడు రేగల్లపల్లె వాసి సానెపల్లె ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పేకాట పెద్దఎత్తున జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మంగళ వారం జరిగిన పేకాటలో దాదాపు 15మంది వరకు పాల్గొన్నట్లు సమా చారం. ఈ విచారణలో పేకాట నిర్వా హకులను పోలీసులు నిర్ధారించుకు న్నారు. వారిని బుధవారం అదుపు లోకి తీసుకుని రూరల్ పోలీసు స్టేషన్‌లో విచారిస్తున్నట్లు సమాచారం. పేకాట సందర్భంగా ఏదైనా గొడవ జరిగిందా.. మరేమైనా జరిగిందా అనే దానిపై లోతుగా పేకాట రాయుళ్లను విచారిస్తున్నారు. అక్కడ నిర్వ హించే పేకాటకు ఎక్కడెక్కడి నుంచి వస్తున్నారు. ఎంత మేరకు అక్కడ జూదం జరుగుతోంది.. ఎవరి ఆధ్వర్యంలో జరుగుతోంది. ఎంతకాలంగా సాగుతోంది. అని కూపీ లాగుతున్నారు. అలాగే ఈ అనుమానాస్పద మృతి వెనుక ఏదైనా కుట్ర దాగివుందా అనే కోణంలో పోలీసులు విచా రణ చేస్తున్నారు. ఏదేమైనా ప్రొద్దుటూరురూరల్ పరిధిలో ఇంకా జూదం సాగుతోందన్నది ఈఅను మానాస్పద మృతితో వెలుగులోకి వచ్చింది. ఇప్పటికైనా పోలీసులు జూదంపై కఠినంగా వ్యవహరిస్తారా లేదా చూడాలి.

టిప్పరు ఢీకొని వృద్ధురాలు మృతి

రాజంపేటటౌన్, సెప్టెంబరు 4: రాజంపేట మండల పరిధిలోని చెర్లోపల్లె వద్ద బుధవారం టిప్పరు ఢీకొన్న సంఘటనలో గాదిరాజు లక్షుమ్మ(75) అక్కడికక్కడే మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. చెర్లోపల్లె గ్రామానికి సమీపంలో కంకర క్రషర్ మిషన్ ఉండడంతో నిత్యం ఈ గ్రామం మీదుగా టిప్పర్లు, ట్రాక్టర్లు వెళుతూ ఉంటాయి. ఈ క్రమంలో లక్షుమ్మ రోడ్డు పక్క నడుచుకుంటూ వెళుతుండగా అతివేగంతో వచ్చిన టిప్పరు వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన లక్షుమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. రాజంపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కడప ప్రకాశ్‌నగర్‌లో చోరీ

- 5 తులాల బంగారు, రూ.లక్ష నగదు అపహరణ

కడప (క్రైం), సెప్టెంబరు 4: కడప నగరం ప్రకాశ్‌నగర్‌లో ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. బంగారం, నగదు అపహరించారు. ఈమేరకు బాధి తుడు రాజారత్నం చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రకాశ్ నగర్‌కు చెందిన రాజరత్నం సొంత పని నిమిత్తం ఇంటికి తాళాలు వేసి మధ్యాహ్నం బయటికి వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చేలోగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. దొంగలు ఇంట్లో ఉన్న 5తులాల బంగారు నగలు, రూ.లక్ష నగదు అప హరించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నారు.

కిడ్నాప్ కేసులో నలుగురు అరెస్ట్



సంబేపల్లె, సెప్టెంబరు 4: రాయచోటి పట్టణం కొత్తపేట రామాపురానికి చెందిన రామచంద్ర కుటుంబ సభ్యుల కిడ్నాప్ కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. వీరిలో తిరుపతికి చెందిన అరుణ్‌కుమార్, యర్రగుంట్లకు చెందిన వరప్రసాద్, శివశంకర్, ఖాదర్‌బాషాను సంబేపల్లె ఎస్‌ఐ భక్తవత్సలం, పోలీసులు శివ శంకర్, నాగేంద్రతో కలిసి బుధవారం రాయచోటి రాజధాని కల్యాణ మండపం వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. రాయచోటి కొత్తపేటకు చెందిన రామచంద్ర బెంగుళూరుకు చెందిన నవీన్‌కు రైస్ పుల్లింగ్ మిష న్‌ను రూ.15 లక్షలకు బేరం చేసుకొని డబ్బులు తీసుకున్నాడు. రైస్ పుల్లింగ్ మిషన్ ఇవ్వకపోగా.. అతనికి డబ్బులు వెనక్కు ఇవ్వలేదు. దీంతో హిందూపురంలో రామచంద్ర అతని కుమారుడు మునికుమార్, అల్లుడు మునిశేఖర్‌ని కిడ్నాప్ చేసి బెంగుళూరుకి తరలించారు. డబ్బులు ఇవ్వాలని హింసించగా రాయచోటిలో ఇస్తానని రామచంద్ర చెప్పడంతో ఆగస్టు 31వ తేదీ కారులో రాయచోటికి వస్తుండగా తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు సెప్టెంబర్ 1వ తేదీ 9 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రామచంద్ర పారిపోయిన రోజున బెంగుళూరులో కొడుకు, అల్లుడిని కూడా కిడ్నాపర్లు వదిలేసినట్లు తెలిపారు. రైస్‌పుల్లింగ్ మిషన్ లాంటి అభూతకల్పనలకు, ప్రలోభాలకు గురై ఇలాంటి కిడ్నాప్ కేసుల్లో చిక్కుకొని భవిష్యత్తును నాశనం చేసుకోవ ద్దని సీఐ తెలిపారు.

గువ్వల చెరువు ఘాట్‌లో మద్యం లారీ బోల్తా

సికెదిన్నె, సెప్టెంబరు 4: గువ్వల చెరువు ఘాట్‌లో మద్యం లారీ బోల్తా పడినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. రాయచోటివైపు నుంచి కడ పకు వస్తున్న మద్యం లారీ గువ్వల చెరువు ఘాట్ దిగుతుండగా 4వ మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడిందన్నారు. ఈ ఘటనలో ఎటు వంటి ప్రాణనష్టం జరుగలేదని .. మద్యం బాటిళ్లు దెబ్బతిన్నాయన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలి

- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



సిద్దవటం పోలీసు స్టేషన్‌లో పోలీసులతో మాట్లడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

సిద్దవటం, సెప్టెంబరు 4: పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి.. వారి సమ్యలను తెలుసుకుని పరిష్కరిం చాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. బుధవారం సిద్దవటం పోలీసుస్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డు లను పరిశీలించారు. కొత్తగా స్టేషన్లలో బాధ్య తలు చేపట్టిన ఎస్‌ఐలు ఫిర్యాదుదారుల పిటి షన్లను రిజిస్టర్‌లో పరిశీలించి ఎలా పరిష్కరిం చాలో చూడాలని ఆదేశించారు. పిటిషనర్‌కు అనుకూలంగా జరిగిందా లేదా అనే విష యాన్ని పరిశీలించాలన్నారు. పాత నేరస్తులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి జీవన విధానం, డబ్బు ఎలా సంపాదిస్తున్నారో అడిగి తెలుసుకోవాలన్నారు. నేరాల్లో పాల్గొంటున్నారా లేదా అనే సమాచారాన్ని వారితో మాట్లాడి తెలుసుకోవాలని ఆదేశించారు. వారి కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. ఎస్‌హెచ్‌వోలు జిల్లా పోలీసుశాఖ రూపొందించిన చెక్‌లిస్టు మేరకు ప్రతి కేసుకు సంబం ధించిన వివరాలు సీడీ ఫైల్లో ఉంచి దర్యాప్తు ప్రక్రి య సజావుగా జరిగేలా దర్యాప్తు నైపుణ్యం పెంపొందించుకునేలా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను త్వరగా డిస్పోజ్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. స్టేషను ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశు ధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతిరోజు గ్రామాలకు వెళ్లి రోజులో సగభాగం ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో అసాంఘిక కార్యక్ర మాలకు పాల్పడే వారి కార్యకలాపాలపై నిఘా ఉం చాలని ఆదేశిం చారు. జిల్లా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ జి.వెంకటరాముడు, ఒంటి మిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్, సిద్దవటం ఎస్‌ఐ వెంకటనాగ చిరం జీవి, సిబ్బంది ఉన్నారు.

అట్లూరు పోలీసుస్టేషన్‌లో తనిఖీ

అట్లూరు, సెప్టెంబరు 4: అట్లూరు పోలీసుస్టేషన్‌ను బుధవారం కడప ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తనిఖీ చేశారు. స్టేషన్ స్థితిగతుల గురించి ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండే విధంగా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. వినాయక చవితి సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో తిరిగి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఇన్‌చార్జ్ ఎస్‌ఐ కేసీ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేద్దాం : మాజీ సీఎం



మాట్లాడుతున్న మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 4: బీజేపీని నాయకులు, ప్రతి కార్యకర్త కింది స్థాయి నుంచి బలోపేతం చేయడానికి కృషి చేయాలని బీజేపీ నేత, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని న్యూఆంధ్ర కల్యాణమండపంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దేశంలో ఇద్దరు సభ్యులతో మొదలై నేడు బలమైన పార్టీగా ఎదిగింది అని తెలిపారు. ప్రపం చంలో అత్యధిక సభ్యులు కలిగిన ఏకైక బలమైన పార్టీగా బీజేపీ స్థానం సంపాదించిందని ఆయన తెలిపారు. అయినప్పటికీ దక్షిణ భారతదేశంలో ఇతర రాజకీయ పార్టీలతో కలిసి పోటీ చేసి ప్రభు త్వాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఇక నుంచి అలా కాకుండా స్వయం శక్తిగా పార్టీ సుస్థిర పాలన అందించేలా పార్టీని బలోపేతం చేయాల న్నారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు 45 రోజుల వ్యవధిలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. బీజేపీ అందిస్తున్న పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. మైనార్టీలకు ప్రత్యేకంగా బీజేపీ అభివృద్ధి కాంక్షిస్తున్న వారి ఓటు బ్యాంకు కోల్పోతున్నామని, వారికి ఉన్న అపోహలను తొలగించి ఓటు బ్యాంకు పెంచాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేశ్‌లు మాట్లా డుతూ దేశవ్యాప్తంగా బీజేపీ 10 కోట్లకు పైగా సభ్యత్వ నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారని తెలిపారు. అందులో మన రాష్ట్రంలో ఒక కోటి సభ్యత్వ నమోదు చేసేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. బీజేపీ అధికారంలో ఉంటే దేశం సర్వవిధాల అభి వృద్ధి సాధిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. సమా వేశంలో బీజేపీ నేతలు కృష్ణయాదవ్, సురేష్, చంద్రమౌళి, గోపాల్‌రెడ్డి, కిరణ్ కుమార్, బాలాజీ, రాజంపేట నియోజకవర్గంలోని వివిధ మండలాల నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.

అత్యుత్తమ పరిశోధన ఫలితాలు రావాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 4: అత్యుత్తమ ప్రమాణాలతో పరిశోధన ప్రాజెక్టులు పూర్తి చేయాలని వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి అన్నారు. రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాధరెడ్డితో కలిసి బుధ వారం పరిశోధకులతో సమావేశం జరిపారు. రాష్ట్రంలో ఏ యూనివర్శిటీకి రాని విధంగా 54 పరిశోధన ప్రాజెక్టులు వైవీ యూకు లభించాయన్నారు. పరిశోధన పత్రాలు ప్రత్యేక జన రల్స్‌లో ప్రచురితం అయ్యేలా చూడాలన్నారు. అనంతరం ప్రాజెక్టు ఫెలోలను నియ మించుకోవాలన్నారు. ప్రాజెక్టులు పొం దిన సైన్స్ ఆర్ట్స్ విభాగ ఆచార్యులు, సహా య సహాచార్యులు పరిశోధన అనుమతి పత్రాలను అందజేశారు.

చిత్రకళ ప్రదర్శనను సందర్శించిన విద్యార్థులు

వైవీయూ ఫైన్ ఆర్ట్స్‌శాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను నగరం లోని పలుపాఠశాలల విద్యార్థులు సందర్శించారు. ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 5 వరకు ప్రదర్శన కొనసాగుతున్న నేప ధ్యంలో ఆర్ట్స్ గ్యాలరీలో శిల్పకళ, చిత్రకళ డిజైన్లను విద్యార్థులు తిలకించారు. లలిత కళల శాఖ విభాగాధిపతి కోట మృత్యుంజ యరావు విద్యార్థులకు లలిత కళలు గురించి వివరించారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

వేంపల్లె, సెప్టెంబరు 4: జీవితం కోల్పోయేందుకు కారణమయ్యే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త సూచించారు. బుధ వారం డ్రగ్స్ నిషేధంపై ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా డ్రగ్స్ వాడకంతో వారి జీవితాల్లో ఎంత నష్టం వాటి ల్లు తుందో, జీవనశైలి ఎలా దెబ్బతింటుందో వివరించారు. పరి పాలన అధికారి రవికుమార్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ మధుసూద న్‌రెడ్డి, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మంత్రి ఆనం రామ్‌నారాయణ రెడ్డి రాక

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 4: రాష్ట్ర దేవదాయశాఖ మం త్రి ఆనం రాంనారాయణరెడ్డి ఈ నెల 6న గాలివీడు రామాల యంలో కుంభాబిషేకంలో పాల్గొంటారని సమాచారశాఖ అధికా రులు తెలిపారు. అనంతరం చిత్తూరు జిల్లా కానిపాకం వెళతా రన్నారు. ఆయన వెంట రాష్ట్ర రోడ్డు రవాణశాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డి కూడా వుంటారని తెలిపారు.

పిల్లలందరూ అంగన్వాడీలలో ఉండాలి : కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 4: పిల్లలందరూ అంగన్వాడీ కేంద్రాలలో ఉండే విధంగా చూసుకుని, వారికి విద్యాబుద్ధులు నేర్పించాలని ఐసీడీఎస్ అధికారులను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూపర్‌వైజర్లు పిల్లల కోసం ప్రత్యేక చొరవ తీసుకొని పిల్లలందరూ అంగన్వాడీ కేంద్రాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నపిల్లలు కాబట్టి వారికి మంచి భోజనం అందించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల హాజరు శాతం తక్కువ కాకుండా పక్కగా నమోదు చేయాలన్నా రు. ప్రతి రోజు ఉదయం ఒక ఫొటో, మధ్యాహ్నం భోజనం చేసేట ప్పుడు మరియు సాయంత్రం ఇంటికి వెళ్లేటప్పుడు ఒక ఫొటో తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయాలన్నారు. అంగన్వాడీ కార్య కర్తలు ఎటువంటి పొరపాట్లు చేసినా వారిపై కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శశిక ళ, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూములు ఆక్రమిస్తే చర్యలు

- జిల్లా దేవదాయ ధర్మాదాయశాఖ అధికారి విశ్వనాథం

గాలివీడు, సెప్టెంబరు 4: జిల్లాలోని దేవదాయ భూములు ఆక్ర మించిన వారిపై చర్యలు తప్పవని జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి విశ్వనాధం పేర్కొన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని కోదండ రామాలయం, గాలివీటమ్మ ఆల యాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 9761 ఎకరాల దేవదాయ భూములు కలవని, వీటిలో 460 ఎకరాలు సర్వీసర్ల ఆధీనంలో ఉన్నాయని, ఇంకా 5567 ఎకరాల భూమిని గుర్తించాల్సి ఉందన్నారు. 1170 ఎకరాలు భూములు పరాధీనంలో కలవని, 2542 ఎకరాల భూములు సాగుకు లీజుకి ఇచ్చామన్నారు. జిల్లాలో 268 ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకం అమలు జరుగుతున్నదని తెలిపారు. దేవా లయ భూముల దురాక్రమణ కాకుండా ప్రజాప్రతినిధులు, భక్తులు కూడా సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. ప్రధానంగా రెవెన్యూశాఖను సమన్వయం చేసుకొని దేవాలయ భూములు గుర్తిస్తామన్నారు. జిల్లాలోని అర్హత కలిగిన ఆలయా లకు ధూప దీప నైవేద్య పథకం అమలుకు చర్యలు చేపడుతున్నా మని తెలిపారు. ఈవో కొండారెడ్డి, పూలుకుంట సర్పంచ్ పార్థసా రథిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విజయవాడలో కడప పోలీసు సేవలు



మహిళను మోసుకొస్తున్న కడప పోలీసులు

కడప, క్రైం సెప్టెంబరు 4: విజయవాడ బాధితులను కడప పోలీసులు రక్షిస్తున్నారు. భారీ వర్షాల కారణంగా విజయవాడ నీటితో అతలాకుతలమైన విషయం తెలిసిందే. వేలాది మంది వరదల్లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో స్పందించిన కడప ఎస్పీ ఆదేశాలతో బాధితులను రక్షించేందుకు కడప నుంచి కొందరు పోలీసు అధికారులతో పాటు ఫైర్ సిబ్బంది వెళ్లారు. కడప చిన్నచౌక్ ఎస్‌ఐ రాజరాజేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం నీళ్లలో చిక్కుకున్న వారిని రక్షించే చర్యలు చేపట్టారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ఎ.నాగేశ్వరరావు



జీవామృతం తయారీని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

సికెదిన్నె, సెప్టెంబరు 4: ప్రకృతి వ్యవసాయం పద్దతుల ద్వారా సాగైన పంటలు ఆరోగ్యకరంగా ఉంటాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ఎ.నాగేశ్వరరావు సూచించారు. ప్రతి రైతు పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఇప్పెంటలో బుధవారం జీవామృతం తయారీ విధానం, వాటి ఉపయోగాల గురించి రైతులకు ప్రత్యకంగా చూపించి వివరించిన ఆయన మాట్లాడుతూ రైతులందరూ పంట నమోదు చేయించుకోవడం, ఈకేవైసీ కూడా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఈశ్వర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి రేఖ, ఏపీసీఎంఎఫ్ సిబ్బంది, ఐసీఆర్‌పీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉలిమెల్లలో పొలంబడి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 4: ప్రకృతి వ్యవసాయం వలన పెట్టుబడులు తగ్గి పంట దిగుబడులు పెరుగుతాయని పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఉలిమెల్లలో నిర్వహించిన పొలంబడిలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా పండిస్తే నేల తన స్వభావాన్ని కోల్పోకుండా సూక్ష్మస్థూల పోషకాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్దతిలో ఘన, ద్రవ జీవామృతాలు, పురుగులకు, తెగుళ్ల నివారణకు కషాయాలు వాడుకుని పంటలు పండించుకోవడం వలన మంచి పంటలు వస్తాయన్నారు. ప్రతి బుధవారం పొలంబడి నిర్వహిస్తారని, ఈ కార్యక్రమం ద్వారా పంటల్లో యాజమాన్య పద్దతులన్నింటినీ పాటించి సకాలంలో చేయడం వాటిని రైతులకు అవాహన వచ్చేలా తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ అధికారి నరసింహా రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవీంద్ర గౌడ్, శివార్జున్‌రెడ్డి, నబహానిబి, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

ఇంక్రిమెంట్ల కోత ఉత్తర్వులు రద్దుచేయాలి

ఆర్‌జేడీకి యూటీఎఫ్ వినతి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 4: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరు కాలేదనే కారణంగా జిల్లాలోని నలుగురు ప్రధానోపాధ్యాయుల ఇంక్రిమెంట్ల కోత ఉత్తర్వులను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్ మహేశ్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం ఆర్‌జేడీ కార్యాలయంలో ఆర్‌జేడీ శ్యామ్యుల్‌ను కలిసి వినతిపత్రం అందించిన ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల విధులకు హాజరు కాలేదనే కారణంతో ప్రధానోపాధ్యాయులకు విధించిన ఇంక్రిమెంట్లు కోతను రద్దు చేయాలని కోరారు. అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి ఉత్తర్వులు రద్దుచేయాలన్నారు. పాఠశాల విద్య పూర్వ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ కడప జిల్లా పర్యటన సందర్భంగా చిన్నచిన్న కారణాలతో వల్లూరు ఎంఈఓ లిల్లెమ్మ, జడ్పీహైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసులు ఇంగ్లీషు టీచర్ డేవిడ్‌కు నిలుపుదల చేసిన ఇంక్రిమెంట్లు సైతం పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర

చెన్నూరు, సెప్టెంబరు 4: ఎమ్మెల్యేగా పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి గెలుపొందడం, రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టడంతో తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి ముండ్ల శ్రీనివాసులరెడ్డి తన కుటుంబ సభ్యులతో బుధవారం తిరుమలకు పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. స్వగామం గుర్రంపాడు నుంచి దేవునికడప వెంకటేశ్వర ఆలయానికి వచ్చి పూజలు చేసి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు బయల్దేరారు. అనుకున్నట్లు జరగడంతో తాను తిరుమల పాదయాత్ర మొక్కు తీర్చుకుంటున్నానన్నారు.

వికసిత్ భారత్‌గా మారుద్దాం

పార్టీ సభ్యత్వ నమోదులో బీజేపీ నేతలు



సభ్యత్వ నమోదులో బీజేపీ నేతలు శశిభూషణ్ రెడ్డి, సింగారెడ్డి

కడప (మారుతీనగర్) సెప్టెంబరు 4: మన దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు తీసుకెళ్లి తద్వారా ప్రకాశవంతమైన దేశంగా తీర్చిదిద్దేందుకు పదేళ్లగా కేంద్రంలో సుపరిపాలన సాగిస్తున్న బీజేపీకి యావత్ భారత దేశ ప్రజలంతా అండగా నిలబడేలా పార్టీ సభ్యత్వం తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారకమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి కోరారు. బీజేపీ జాతీయ సభ్యత్వ నమోదులో భాగంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలో గల బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో 8800002024తో సభ్యత్వం నమోదు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో కెల్లా మన దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించేలా కేంద్రంలో పాలన సాగిస్తున్న దేశ ప్రధాని నరేంద్రమోదీ సుపరిపాలనకు జిల్లా ప్రజలు సంపూర్ణ మద్దతు అందించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఏ పార్టీకి లేనంతగా 18 కోట్ల మంది ప్రజలు బీజేపీ సభ్యత్వం తీసుకున్నారని గుర్తు చేశారు. 2014 లో 11 కోట్ల మంది సభ్యత్వం వున్న బీజేపీ 2018 నాటికి 18 కోట్లకు చేరిందన్నారు. ప్రతీ ఆరేళ్లకోమారు అప్పటివరకూ వున్న సభ్యత్వం రద్దు కాబడి తిరిగి కొత్తగా సభ్యత్వం తీసుకోవాల్సి వుంటుందన్నారు. ఏదేమైనా పార్టీ సభ్యత్వ నమోదులో ఇప్పటి వరకూ వున్న 18 కోట్ల సభ్యత్వ ప్రపంచ రికార్డును మరో మారు చేపట్టనున్న సభ్యత్వ నమోదులో బ్రేక్ కావడం తథ్యమన్నారు. ఇతర ఏ పార్టీ కూడా బీజేపీకి దరిదాపుల్లో లేదన్నారు. కాకపోతే చైనా దేశంలో అక్కడి సీపీఐకి 8 కోట్ల మంది సభ్యత్వం వుందన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ మొదటి విడతగా ఈనెల 25 వరకూ వుంటుందన్నారు. రెండో విడతగా అక్టోబరు 1 నుంచి 15 వరకూ వుంటుందన్నారు. ప్రధానంగా స్వచ్ఛందగా ప్రజలు బీజేపీ సభ్యత్వం స్వీకరించి మనదేశాన్ని 2047 నాటికి బలమైన వికసిత్ భారత్‌గా మార్చాలని ప్రజలను కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృతనిశ్చయంతో ముందుకు సాగాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, నేతలు బొమ్మన సుబ్బరాయుడు, బీరం సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రోశన్న, చాగలమర్రి ఓబులేసు, మాచునూరు హరికృష్ణ, మహిళా నాయకురాలు చేపూరి శారదమ్మ, పద్మావతి భాయి పాల్గొన్నారు.

ప్రతిరైతు ఈ-కేవైసీ చేయించుకోవాలి

వేముల, సెప్టెంబరు 4: పంట నమోదు చేసుకున్న ప్రతిరైతు ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. బుధవారం మీది పెంట్ల రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న ఈ-కేవైసీని పరిశీలించారు. ఇప్పటి వరకు 13374 ఎకరాల్లో పంట నమోదు పూర్తి అయినట్లు తెలిపారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు సంబంధిత రైతు సేవా కేంద్రంలో ఈ-కేవైసీ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జి సంతోష్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

ఉర్దూ డీఐ పోస్టుల్లో భర్తీకి చర్యలు తీసుకోవాలి : ఎస్టీయూ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 4: రాయలసీమ జోన్4 పరిధిలో ఉర్దూ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఉర్దూ డీఐ పోస్టు భర్తీ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంఘమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి డిమాండ్ చేశారు. కార్యాలయంలో ఆర్‌జేడీకి వినతిపత్రం అందించిన వారు మాట్లాడుతూ ఉర్దూ సెక్టారు పాఠశాలలు విద్యార్థులు తీవ్ర నష్టానికి గురవుతున్నారని చెప్పారు. తక్షణం జిల్లాలో ఉర్దూ డీఐ పోస్టులను భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. .

సర్దుబాటు ప్రక్రియలో తీరని అన్యాయం

జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో ఉర్దూ ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలకు ఉర్దూ వర్ణమాల కూడా రాని తెలుగు మాధ్యమ ఉపాధ్యాయులను ఉర్దూ సబ్జెక్టు టీచర్లుగా కేటాయించారని ఇది ఉర్దూ విద్యార్థులకు తీరని నష్టం కలిగిస్తోందని రూటా జిల్లా అధ్యక్ష ప్రధాన క్యాదర్శులు ఇర్షాద్, జాకిర్‌హుసేన్ కోరారు. కార్యాలయంలో ఆర్‌జేడీ శ్యామ్యుల్‌కు వినతిపత్రం అందించిన వారు మాట్లాడుతూ ఉర్దూ రాని ఉపాధ్యాయులను ఉర్దూ పాఠశాలలకు విద్యాబోధనకు కేటాయిస్తే ఉర్దూమాధ్యమం విద్యార్థుల విద్యాప్రమాణాలు పాతాళానికి పడిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి బదులు అర్హత కలిగిన విద్యావలంటీర్లను నియమించాలని కోరారు.

పోషకాహార మాసోత్సవాల పరిశీలన



పోషకాహారంపై సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ

సింహాద్రిపురం, సెప్టెంబరు 4: అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహిస్తున్న పోషకాహార మాసోత్సవాలను ఎంపీడీఓ కృష్ణమూర్తి పరిశీలించారు. ప్రత్యేకంగా ఏఎన్ఎం రక్త పరీక్షలు నిర్వహించారు. చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవ లసిన జాగ్రత్తలు వివరిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత ఎంపీడీఓకు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

వేముల, సెప్టెంబరు 4: ప్రతి గర్భిణి, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని సూపర్ వైజర్ హసీన సూచించారు. బుధవారం నల్లచెరువుపల్లె అంగన్వాడీ కేంద్రంలో తల్లులు, కిశోర బాలికలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏఎన్ఎం, ఆశ,మహిళా సంరక్షణ కార్యదర్శి పాల్గొన్నారు.

అవినీతి ఎస్ఓలపై చర్యలు తీసుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 4: జిల్లాలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కేజీబీవీ స్పెషల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాహుల్, రవి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ గంగాధరగౌడ్‌కు వినతిపత్రం అందించిన వారు మాట్లాడుతూ జిల్లాలో చాలా కేజీబీవీల ఎస్ఓలు విద్యార్థులకు ప్రభుత్వమందించే మెనూ సక్రమంగా అమలు చేయకుండా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ చాలీచాలని భోజనం పెడుతూ విద్యార్థుల కడుపు కొడుతున్నారన్నారు. అటువంటి ఎస్ఓలను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లావ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సమస్యలను పరిష్కరిస్తా : ఎమ్మెల్సీ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, సెప్టెంబరు 4: ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక నివాసంలో నిర్వహించిన ప్రజాదర్బారులో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలు అప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పాలన అందిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 4: పురపాలక ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ కడప నగర అధ్యక్షుడు సాధిక్‌అలీ డిమాండ్ చేశారు. బుధవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందించిన ఆయన మాట్లాడుతూ పురపాలక ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు జరిగి చాలా ఏళ్లయిందని తక్షణం బదిలీలు, పదోన్నతులు జరపాలని కోరారు. దీనికి మంత్రి కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ నేతలు పాల్గొన్నారు.

అంకితభావానికి మారు పేరు ఉమేశ్‌చంద్ర

ఉమేశ్‌చంద్రకు నివాళులర్పించిన జిల్లా పోలీసుశాఖ

కడప (క్రైం), సెప్టెంబరు 4: దివంగత ఉమేష్‌చంద్ర స్ఫూర్తిగా తీసుకుని విధుల్లో క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావం, నిజాయితీతో సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. ఉమేష్‌చంద్ర వర్ధంతి సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉమేష్ చంద్ర 1966 మార్చి 29న గుంటూరు జిల్లా పెదపూడిలో జన్మించారన్నారు. డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేట్‌లలో గోల్డ్‌మెడల్ అందుకుని, 1991లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారన్నారు. కడప జిల్లాలో 1994లో ఏఎస్పీగా 1995లో ఎస్పీగా విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందారన్నారు. జనజాగృతి పేరుతో ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేసి పోలీసుశాఖను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఆద్యుడు ఉమేష్‌చంద్ర అన్నారు. ఉమేశ్‌చంద్ర 1999 సెప్టెంబరు 4న మరణించారన్నారు. ఉమేష్‌చంద్ర భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాల సాధనకు సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

కడప రూరల్ సీఐగా చల్లని దొర



పెండ్లిమర్రి, సెప్టెంబరు 4: కడప రూరల్ ఇన్‌స్పెక్టర్‌గా డి.చల్లని దొర బుధవారం పెండ్లిమర్రి సీఐ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనకు స్థానిక ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అన్ని చర్యలు చేపడతామన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడతామ న్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారమయ్యే దిశగా ముందుకు వెళ్తామని, డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. కార్యక్ర మంలో పెండ్లిమర్రి, ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీటీ స్కాన్ సేవలు ప్రారంభం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 4: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సీటీ స్కాన్ సేవలు ప్రారంభమైనట్లు సూపరింటెండెంట్ మల్లీశ్వరి వివరించారు. ఆమె మాట్లాడుతూ సీటీస్కాన్ చేయించుకోవాలంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో దాదాపు రూ. 5వేల నుంచి రూ.8వేలు దాకా ఖర్చు అవుతుందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేసుకోవాల్సిన అవసరం ఇకపై ఉండదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చిందని, ఎన్నో రకాల చికిత్సలకు ఉపయోపడే ఈ సీటీస్కాన్ పరీక్షలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కార్యకర్త కుటుంబానికి పుత్తా పరామర్శ



సికెదిన్నె, సెప్టెంబరు 4: టీడీపీ కార్యకర్త అన్నంరాజు ఆదినారాయణ కుటుంబాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి బుధవారం పరామర్శించారు. కొలుములపల్లె కృష్ణాపురంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటివద్ద ఉన్న ఆదినారాయణను పరామర్శించి కుటుంబానికి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తరుపున అందాల్సిన సాయాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గంధం మోహన్‌బాబు, వెంకటసుబ్బయ్య, మహేంద్ర, డి.వి., తదితరులు పాల్గొన్నారు.

యువతరంపై ఆరుద్ర ముద్ర

కడప (నాగరాజుపేట), సెప్టెంబరు 4: అభ్యుదయ కవిగా శ్రీశ్రీ తరువాత యువతరంపై ఎక్కువ ముద్ర పడిన కవి ఆరుద్ర అని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో శనివారం సాయంత్రం ఆరుద్ర శత జయంతిలో ఆయన మాట్లాడుతూ కవిగా, పండితుడు, పరిశోధనకుడు, నాటకకర్త, విమర్శకుడిగా ఆరుద్ర ప్రసిద్ధులన్నారు. ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు, సభ్యులు పొదిలి నాగరాజు, డాక్టర్ వెంకటేశ్వరచారి, రచయిత బాల యల్లారెడ్డి, ఉపాధ్యాయురాలు జ్ఞానదేవి, బాల ఓబయ్య, శివ, మధు తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థ ద్వారా సమాజ సేవ

చెన్నూరు, సెప్టెంబరు 4: సమాజ సేవ చేయడానికే మానవత సంస్థ ఏర్పాటు చేశారని ఈ సంస్థ ద్వారా నిత్యం రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని సంస్థ మండల శాఖ అధ్యక్షుడు ఆవుల బసిరెడ్డి అన్నారు. హిందూ శ్మశాన వాటిక రోడ్డు కిరువైపులా సభ్యులు మొక్కలునాటారు. సంస్థ అధ్యక్షుడు జీఎన్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ హిందూ శ్మశానాన్ని శుభ్రపరచడంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఓ గదిని ఏర్పాటు చేసి అందులో అన్ని రకాల వస్తువులు ఏర్పాటు చేశామని శ్మశానంలో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సంస్థలో భాగస్వాములై సమాజ సేవకు ముందుకు కదలాలన్నారు. బలిజ సంఘం జిల్లా నేత ఆకుల ప్రసాద్‌బాబు, సంస్థ సభ్యులు ఆటో బాబు, నీలం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల ద్వారా అంతర్జాతీయ ఖ్యాతి

వేంపల్లె, సెప్టెంబరు 4: క్రీడల్లో రాణిస్తే అంతర్జాతీయ ఖ్యాతి లభిస్తుందని ఎంపీడీఓ దివిజ సంపతి తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఎస్‌బీ రవికుమార్, కార్యదర్శి స్టాలిన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ ఆటస్థలంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులతో జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈనెల 14 నుంచి శ్రీకాకుళం వజ్రకొత్తూరులో జరిగే అంతర్‌రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్న జిల్లా జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేశారు. పీఈటీ రాజశేఖర్, హెచ్ఎం, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజాపాలకుడు అంటే చంద్రబాబే : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

కమలాపురం రూరల్, సెప్టెంబరు 4: ఎంతటి విపత్తయినా ఎదుర్కొనే పట్టుదల కృషి సీఎం చంద్రబాబుకు ఉందని దాని ఫలితమే విజయవాడలో వరదల నుంచి ప్రజలకు విముక్తి కల్పించడమని ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ పరిసర ప్రాంతాల్లో వచ్చిన భారీ వరదలతో సమస్యల్లో చిక్కుకున్న ప్రజలకు సహాయం అందించడానికి 74 ఏళ్లలో కూడా యువకుడిలా రాత్రీపగలు తేడా లేకుండా అహర్నిశలు ప్రజల మధ్యనే ఉంటూ సహాయక చర్యల్లో పర్యవేక్షించిన గొప్ప నేత చంద్రబాబు అన్నారు. ప్రజలకు అవసరమైన పాలు, నీళ్లు అందిస్తూ ప్రభుత్వ వ్యవస్థలే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, విజయవాడ దుర్గమ్మ సన్నిధి ద్వారా ఆహారం తయారు చేయించి ప్రజలకు అందిస్తూ సేవలు చేస్తుంటే అది ఓర్వలేని జగన్‌రెడ్డి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో వరదలు, తుఫాను వచ్చి ప్రజలు విలవిల్లాడుతుంటే ప్యాలెస్‌లో కూర్చుని చికెన్ పకోడీలు, ఎగ్‌పఫ్‌లు తింటూ ఏదో సినిమా చూసినట్లు చోద్యం చూస్తూ గ్రౌండులో పని చేయాల్సిన అధికారులను తన ప్యాలెస్‌కు రప్పించుకుని మాట్లాడిన వ్యక్తి జగన్ అని అన్నారు. బుడమేరు వాగుపై ఎటువంటి లిఫ్ట్ గేట్లు లేకపోయినా గేట్లు ఎత్తడంతోనే వరదలు వచ్చాయని జగన్ అనడం చూస్తుంటే ఆయన ఎలా సీఎంగా వ్యవహరించారో అర్థం కావడం లేదన్నారు. సీనియర్ నేతలు దేవరాజు పల్లె నాగిరెడ్డి, జిల్లా బీసీ నేతలు గండి నారాయణ, నియోజకవర్గ నేతలు గుజ్జులనారాయణ, జిల్లా రైతు నాయకులు రమనారెడ్డి, మండల రైతు అధ్యక్షులు రవీంద్రా రెడ్డి, లేటల్లె ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్టు

చెన్నూరు, సెప్టెంబరు 4: రామనపల్లె వద్ద పేకాడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సీఐ పురుషోత్తంరాజు ఆదేశాలతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

పులివెందుల టౌన్, సెప్టెంబరు 4: విజయవాడ వరద బాధితుల కోసం రూ.25వేలు విరాళాన్ని పులివెందుల ఇన్‌చార్జ్ బీటెక్ రవికి అందించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వేముల మండలం చాగలేరు వాసి, ఎస్సీ సెల్ టీడీపీ నేత చంటి విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.25వేలు నగదును బీటెక్ రవికి అందించారు. బీటెక్ రవి మాట్లాడుతూ వరద ప్రాంతాల్లో వేగంగా సహాయక చర్యలు జరుగుతున్నాయన్నారు. జగన్‌లా హెలీక్యాప్టరులో వచ్చి వెళ్లే ముఖ్యమంత్రి చంద్రబాబు కాదన్నారు. అనంతరం ఆర్థిక సాయం అందించిన చంటిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పక్కదారి పట్టిన పేదల బియ్యంపై విచారించాలి

తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డి



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న సంబటూరు వాసులు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 4: పేదలకందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పట్టిందని విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పుత్తా యల్లారెడ్డి డిమాండ్ చేశారు. తహసీల్దారు శివరామిరెడ్డికి ఫిర్యాదు చేసిన ఆయన మాట్లాడుతూ సంబటూరు పంచాయతీలో పేదలకు అందించాల్సిన రేషన్ బియ్యం, సరుకులు అందడం లేదన్నారు. ఆర్ఐతో మాట్లాడితే నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నాడని ఆరోపించారు. దాదాపు 110 బ్యాగులు బియ్యం స్టాకు లేవని అవి ఎక్కడికి పోయాయో అధికారులు తెలపాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం ఎక్కడికి వెళ్లాయో విచారించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెలకు 180 బ్యాగులకు కేవలం 70 బ్యాగులు మాత్రమే వచ్చాయని, వాటిలోనూ బియ్యం ఎంత మందికి పంచాలని అధికారులను ప్రశ్నిస్తే మిగులు బియ్యం మీ వద్దే ఉన్నాయని సమాధానం చెబుతు న్నారని ఇది ఎంత వరకు న్యాయం అని అన్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

సంబటూరులో 110 బ్యాగులు బియ్యం తక్కువగా ఉన్నాయని సమాచారం వచ్చింది. రేషన్ బియ్యం ప్రజలకు పంచడంలేదని విచారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు ఫిర్యాదు చేశారు. రెగ్యులర్ డీలరు లేకపోవడం వీఆర్‌ఏ ద్వారా పంచడంతోనే ఈ సమస్య వచ్చింది. గతంలో రేషన్ బియ్యం పంచిన వీఆర్‌ఏ చనిపోయాడని ప్రస్తుతం ఇన్‌చార్జ్ వీఆర్‌ఏ పంచుతున్నాడని దానిపై విచారణ చేయిస్తాము. రేషన్ బియ్యంలో అవినీతి జరిగినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాము.

తహసీల్దారు శివరామిరెడ్డి

ప్రమాదం పట్ల మున్సిపల్ అధికారులు బాధ్యత వహించాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 4: పారిశుధ్య కార్మికులకు తెల్లవారు జామున జరిగిన ప్రమాదానికి మున్సిపల్ అధికారులు బాధ్యత వహించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం కడప కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టిన వారు మాట్లాడుతూ వేకువనే 3గంటలకు జమాల్‌పల్లి ఎన్‌టీపీసీ పరిధిలో చెత్త తరలింపు వాహన ప్రమాదం అధికారుల తప్పిదమేనన్నారు. వాహనాలు పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్‌గా లేవని, ఇన్సూరెన్స్ కూడా లేదని, పైగా అర్హత లేని కార్మికులను డ్రైవర్లుగా నైపుణ్యం లేని వారిని వినియోగిస్తున్నారన్నారు. హెవీలైసెన్స్ కలిగి ఆప్కాస్ డ్రైవర్లను కాదని సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలను వారికి అనుకూలమైన వారికి అడిషనల్ వర్కర్లను డ్రైవర్లుగా ఎక్కిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో కొందరికి లైసెన్సు కూడా లేదని ఇందుకు పూర్తి బాధ్యత అధికారులదేనన్నారు. మెరుగైన చికిత్సకు పదిలక్షల పరిహారం అందించాలని పూర్తిగా వారు కోలుకునే వరకు వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కార్మికులను అడిషనల్ కమిషనర్ ఎంహెచ్ఓ సందర్శించి అనంతరం ధర్నా వద్దకు వచ్చి క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు హాస్పిటల్‌లో చేరుస్తామనిరూ.5లక్షలు వారి అకౌంటులో జమ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు సుంకర రవి, తిరుపాల్, చంద్రరెడ్డి, శ్రీరాం, ప్రకాశ్, కిరణ్, గోపి, విజయ్, నాగరాజ్‌తో పాటు పెద్దఎత్తున మున్సిపల్‌కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 4: అగస్త్యేశ్వర ఆలయంలో గణపతి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో 48వ వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ కార్యదర్శి నరసింహారెడ్డి, కోశాధికారి వీరసుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వినాయక చవితి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు గురివిరెడ్డి, సహాయ కార్యదర్శులు శంకరయ్య, ఓబులేసు, గోనా ప్రభాకర్‌రెడ్డి, ముత్యాల సేతురావు, వీరారెడ్డి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

పకడ్బందీగా గణేశ్ ఉత్సవాలు

రాజుపాలెం, సెప్టెంబరు 4 : గ్రామాల్లో గణేశ్ ఉత్సవాలపై మండల స్థాయి అధికారులతో బుధవారం మండల పరిషత్ సభాభవనంలో సమీక్ష నిర్వహించారు. తహసీల్దారు వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వినాయక విగ్రహాల మండపాల ఏర్పాట్ల నుంచి నిమజ్జనం వరకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు, పోలీసులు, విద్యుత్‌శాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. విగ్రహాల వద్ద భద్రతా నిర్వాహకులు పర్యవేక్షనలో ఉండాలన్నరు. నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే నిమజ్జనం చేయాల్సిఉంటుందన్నారు. ఏమైనా లోటు పాట్లు జరిగితే ఉత్సవ కమిటీదే బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కత్తి వెంకటరమణ, ఇరిగేషన్ ఏఈ జాన్సన్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టరు అశోక్‌కుమార్, పంచాయతీకార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

15 లోపు ఈకేవైసీ పూర్తి చేయించుకోండి

మైదుకూరు రూరల్ ,సెప్టెంబరు 4 : మైదుకూరు మున్సిపాలిటీ, మండలంలోని రైతులు దగ్గరలోని వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ నెల 15 లోపు ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో లక్ష్మీప్రసన్న తెలిపారు.అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు ఈకేవైసీ చేయించుకొనేందుకు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ నెంబర్ సహాయంతో చేసుకోవచ్చునని తెలిపారు.ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంట నమోదు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని తెలిపారు. అంతేకాకుండా పంటలకు కావలసిన యూరియా, డీఏపీ,వైట్ పొటాష్ అన్నలూరు,శివపురం, నంద్యాలంపేట,ఆదిరెడ్డిపల్లె,వనిపెంట, గంజికుంటలలోని రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని లక్ష్మీప్రసన్న తెలిపారు.

చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి

మైలవరం, సెప్టెంబరు 4: చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులివ్వటంతో పాటు సమస్యలు పరిష్కరించాలని జిల్లా చేనేతశాఖ ఏడీ నాగరాజుకు బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాములేటి, బీజేపీ జిల్లా చేనేత కన్వీనర్ వెంకటేశ్వర్లు కలిసి వినతిపత్రం అందించారు. బుధవారం కడప చేనేత జిల్లా కార్యాలయంలో ఏడీని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్, గుర్తింపు కార్డులు, ముద్రాలోన్లు తదితర సమస్యలపై వివరించారు. జిల్లాలో జమ్మలమడుగు నియోజకవర్గంలో అధికంగా చేనేత కార్మికులు ఉన్నారని వారిలో చాలా మందికి గుర్తింపు కార్డులు లేవని సర్వే చేసి ఇవ్వాలని కోరారు.

మధ్యాహ్న భోజనం కొనసాగించాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 4: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పవన్, హేమంత్, నరసింహ, సుబ్రహ్మణ్యం, ఈశ్వర్, వెంకటేష్, ఖాదర్, శ్రీనివాసులరెడ్డి, నాయక్ పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 4 : విద్యా రంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ క్రియాశీల పోరాటాలకు సిద్ధం అవుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో పట్టణ కమిటీ ఎన్నిక జరిగింది. పట్టణ అధ్యక్షుడుగా సునీల్ కార్యదర్శిగా శ్రావణ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఉపాధ్యక్షుడుగాప్రసాద్ గణేష్ సహాయ కార్యదర్శులుగా యోగేష్, అభినయ్ ఎన్నికలయ్యారు.

కాసులు కొట్టు.. విగ్రహాలు అమ్ముకో..!

● మున్సిపాలిటీ సిబ్బంది బెదిరింపులు ● ఇబ్బందుల్లో వినాయక విగ్రహాల వ్యాపారులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 4: జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలో మూడు రోజుల నుంచి మున్సిపల్ సిబ్బందిలో కొందరు వినాయక విగ్రహాలు విక్రయించే చోట డబ్బులు ఇవ్వాలని ఇస్తేనే విగ్రహాలు అమ్ముకోవాల్సి ఉంటుందని బెదిరించినట్లు విగ్రహాల తయారీదారులు, విక్రయదారులు ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మలమడుగు పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డు మున్సిపల్ కార్యాలయం సమీపాన, మార్కెట్ రోడ్డులో, రామిరెడ్డిపల్లె దారి, తేరు రోడ్డు తదితర ప్రాంతాల్లో వ్యాపారులు వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. అక్కడికి వెళ్లిన మున్సిపల్ సిబ్బందిలో కొందరు తప్పనిసరిగా డబ్బులు ఇవ్వాల్సిందేనంటూ డిమాండ్ చేసినట్లు వ్యాపారులు వాపోతున్నారు. అయితే వినాయక విగ్రహాలకు బెదిరించే వారికి డబ్బులు చెల్లిస్తే ఆ భారమంతా కొనుగోలుదారులపై పడుతుందని మరి కొందరు వాపోతున్నారు. అందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం జమ్మలమడుగు మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో ఒకరు రామిరెడ్డిపల్లె సర్కిల్ సమీపాన ఓ వ్యాపారిని డబ్బులు ఇవ్వాలని, ఇవ్వకపోతే విగ్రహాలను మున్సిపల్ కార్యాలయంలో తీసుకెళ్లి సీజ్ చేస్తామని బెదిరించినట్లుగా అక్కడున్న ఓ వ్యాపారి విలేకరులకు తెలిపారు. మూడు రోజులుగా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో వ్యాపారుల వద్దకు మున్సిపల్ అధికారులు తిరుగుతున్నట్లు తెలిపారు. వ్యాపారం చేసేవారు ఒక్కొక్కరు రూ.15 వేలు, బొమ్మలు తయారు చేసిన వారు రూ.25 నుంచి రూ.35 వేలు ఇవ్వాల్సిందేనంటూ హుకుం జారీ చేసినట్లు సమాచారం. అయితే మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి రూ.10 వేలకు విగ్రహాన్ని కొనుగోలు చేసి తక్కువకు ఇవ్వాలని అడిగినట్లు తర్వాత ఆ విగ్రహాన్ని ఆ వ్యాపారి ఇతరులకు అమ్మకం చేయడంతో ఈ సమస్య స్థానికులందరికీ తెలిసిపోయింది. ఈ విషయమై మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ప్రతి మున్సిపాలిటీలో వినాయక విగ్రహాలు తయారు చేసినా, అమ్మకాలు చేసినా మున్సిపాలిటీకి కొంత డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే తనతో పాటు సిబ్బంది వినాయక విగ్రహాల వద్దకు వెళ్లి డబ్బులు చెల్లించాలని, రశీదులు ఇస్తామన్నారు. రూ.15 వేలకుగాను కొందరు రూ.7 వేలు, మరికొందరు రూ.15 వేలు చెల్లించారని మొత్తం రూ.43 వేలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అయితే తమ సిబ్బందిలో ఎవరైనా అక్కడికి వెళ్లి ఏదైనా చేసి ఉంటే విచారణ చేస్తామని, బొమ్మలు కొనుగోలుదారుల విషయంలో ఏదైనా సమస్యలు వచ్చినా తమకు సంబంధం లేదని ఆయన తెలిపారు.


రామిరెడ్డిపల్లె దారిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు

'ప్రభుత్వం ఇచ్చిన భూములు చూపించండి'

బి.కోడూరు, సెప్టెంబరు 4 : మండల పరిధిలోని రాజుపాలెం హెచ్‌డబ్ల్యూ గ్రామానికి చెందిన గ్రామస్థులకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మున్నెల్లి రెవెన్యూపొలంలో సర్వే నెం.38, 290/6లలో 34 మందికి డీకేటీ పట్టాలు మంజూరు చేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పొలాలు చూపించడంలేదు. దీంతో ఇటీవల కలెక్టరు శివశంకర్ లోతేటికి ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు బుధవారం డిప్యూటీ తహసీల్దారు మధునాయక్ గ్రామ సర్వేనెంబరు వద్దకు వెళ్లి అక్కడ పరిశీలించారు. మీకు ఇచ్చిన పట్టాలు లేవని, అవన్నీ మోసపూరితమైనవని ఎవరో మిమ్మల్ని మోసం చేశారని బాధితులకు తెలిపారు. కానీ ఆన్‌లైన్‌లో నమోదయ్యాయని ప్రభుత్వమందించే పథకాలు, రాయితీలు తీసుకుంటున్నామన్నారు. దీనిపై స్పందించిన డిప్యూటీ తహసీల్దారు మధునాయక్ భూమిలేని వారిని గుర్తించి అర్హులైన వారికి ప్రభుత్వ భూమి అందేటట్లు చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్నెల్లి సర్పంచ్ గురయ్య, రైతులు పాల్గొన్నారు.

నేత్ర దానం చేయాలి


ఈశ్వరరెడ్డి నగర్‌లో అంధత్వ నివారణ ర్యాలీ చేపట్టిన వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 4 : అంధులకు కొత్త జీవితం అందించాలంటే నేత్ర దానం చేయాలని కల్లూరు వైద్య అధికారి డాక్టర్ మహాలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం జాతీయ అంధత్వ నివారణ వారోత్సవాల సందర్భంగా కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని ఈశ్వరరెడ్డి నగర్, పెన్నానగర్, సుబ్బారావు కొట్టాలలో నేత్ర దానం పై ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య అధికారి తేజ, సూపర్‌వైజర్ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ సుబ్బయ్య, సిహెచ్‌వో గంగా తులసి తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మైలవరం, సెప్టెంబరు 4: ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో 6వ తేదిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంషాద్‌బాను బుధవారం తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు. తప్పని సరిగా హాజరు కావాలని ఆమె తెలిపారు.

గుంతలు పూడ్చిన పోలీసులు



కలసపాడు, సెప్టెంబరు 4 : మండల కేంద్రమైన కలసపాడులో బుధవారం పోలీసులు ఆర్అండ్‌బీ రహదారిపై ఉన్న గుంతలు మట్టితో పూడ్చారు. ఇటీవల వర్షాలు రావడంతో ఇంకా పెద్దగా గుంతలు ఏర్పడ్డాయి. ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎస్ఐ చిరంజీవి గోతులను పూడ్చించారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డుకిరువైపులా కంపచెట్లు తొలగింపు


సుందరయ్యకాలనీకి వెళ్లే బ్రిడ్జి వద్ద కంపచెట్లు తొలగిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 4 : రోడ్లకిరువైపులా ఉన్న కంపచెట్లు, పిచ్చిమొక్కలను రంగసముద్రం పంచాయతీ కార్యదర్శి రాజీవ్‌రెడ్డి తొలగించే కార్యక్రమం చేపట్టారు. వర్షాలకు సుందరయ్యకాలనీకి వెళ్లే రహదారి బ్రిడ్జి సమీపంలో రోడ్డుకిరువైపులా కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో కాలనీ వాసులకు ఇబ్బంది ఏర్పడింది. అలాగే గిరినగర్ వాసులకు కూడా రోడ్డుకిరువైపులా కంపచెట్లు, పిచ్చిమొక్కలు మొలవడంతో విషసర్పాలకు నిలయంగా మారింది. విషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో బుధవారం ఆయన ఎక్స్‌కవేటర్‌తో రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలను కంపచెట్ల తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

యూరియా అమ్మకాల్లో చేతివాటం

ఫిర్యాదు చేసిన రైతులు


పెద్దదండ్లూరు రైతు భరోసా కేంద్రంలో విచారణ చేస్తున్న ఏవో చంద్రశేఖర్‌రెడ్డి

జమ్మలమడుగు, సెప్టెంబరు 4: జమ్మలమడుగు మండలంలోని పెద్దదండ్లూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో సిబ్బందిలో ఒకరు యూరియా అమ్మకాల్లో చేతివాటం ప్రదర్శించినట్లు రైతులు ఫిర్యాదు చేశారు. రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు యూరియా బస్తాలు విక్రయించారు. అందులో ఒక యూరియా బస్తా రూ.267.50 విక్రయించాల్సి ఉండగా ఏకంగా చేతివాటం ప్రదర్శిస్తూ రూ.300 విక్రయించినట్లు రైతులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన సర్పంచ్ గువ్వల రామాంజనేయరెడ్డి, రైతులు వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే జమ్మలమడుగు వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి విచారణ చేపట్టారు. సంబంధిత ఉద్యోగి ఆ గ్రామంలోని రైతుల వద్ద యూరియా అమ్మకాల్లో అదనంగా తీసుకోవడం కొందరు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యకు సంబంధించి ఏవో చంద్రశేఖర్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా రైతులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో విచారించి సంబంధిత ఉద్యోగికి షోకాజ్ నోటీసు ఇచ్చి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలి


డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

మైలవరం, సెప్టెంబరు 4: రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో మైలవరంలో నిరసన తెలిపి డిప్యూటీ తహసీల్దారు రూపేష్‌కు వినతిపత్రం అందించారు. బుధవారం మైలవరం తహసీల్దారు కార్యాలయంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి మునిరెడ్డి మాట్లాడుతూ పేదల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోకుండా ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ధరలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు మధు, శ్రీను, రంగ నాయకులు, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం..: రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలు తగ్గించాలని సీపీఐ,ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మీనాకుమారికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సుబ్బారావు, సురేష్,రామాంజనేయులు, సామేల్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ ఇన్‌చార్జి ఉపకులపతిని వెంటనే తొలగించాలి



నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 4: జమ్మలమడుగు పట్టణంలోని పలు కళాశాలలో అవినీతి అక్రమాలకు పాల్పడిన వైవీయూ ఇన్‌చార్జి ఉపకులపతి కె.క్రిష్ణారెడ్డిని వెంటనే తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గుజ్జుల వలరాజు, జిల్లా అధ్యక్షుడు శివశంకర్, విద్యార్థులు డిమాండ్ చేశారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలోని షిరిడీసాయి జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులతో వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధకారంలో ప్రధాన రోడ్డు



జమ్మలమడుగు, సెప్టెంబరు 4: జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలోని కన్నెలూరు గ్రామంలో మెయిన్ రోడ్డులో వీధి దీపాలు వెలుగక అంధకారం నెలకొంది. స్థానికులు బుధవారం రాత్రి మాట్లాడుతూ నాలుగైదు రోజుల నుంచి వీధి దీపాలు వెలుగడంలేదని తెలిపారు. కోతి సమాధి సమీపం నుంచి ఎంఈవో కార్యాలయ రోడ్డు నుంచి గ్రామంలో ఈ సమస్య ఉందని తెలిపారు. అలాగే మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా నుంచి రైల్వేస్టేషన్ వెళ్లే రోడ్డు వీధి దీపాలు పొద్దుపోయేదాకా వీధి లైట్లు వెలుగడంలేదన్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చిరుధాన్యాల మొలకలను వినియోగించాలి


ఖాజీపేట.. తుడుమలదిన్నెలో సూచనలు ఇస్తున్న సూపర్‌వైజర్లు

ఖాజీపేట, సెప్టెంబరు 4: గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాల మొలకలను వినియోగించాలని సూపర్‌వైజర్ భారతి అన్నారు. బుధవారం ఖాజీపేట-1 తుడమలదిన్నె అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాల మొలకకట్టి వినియోగించుకోవడంతోపాటు వాటిని ఎండబెట్టి పొడిచేసి కూడా వినియోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జె.శ్రీదేవి, ఎ.రమాదేవి, ఎంహెచ్‌కే సంధ్యారాణి, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, మహిళలుపాల్గొన్నారు.

చాపాడు..: గర్భిణులు, బాలింతలు విటమిన్లు కలిగిన బలమైన ఆహారాన్ని తినాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, సర్పంచ్ శమీన్‌భాను తెలిపారు. ఖాదర్‌పల్లె గ్రామంలో బుధవారం పోషన్‌మా వేడుక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా ఆకుకూరలు, కాయగూరలు, గుడ్లు, చేపలు వంటివి ఆహారంగా తీసుకోవాలన్నారు. న్యాయవాదులు పర్వీన్, సునీత మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలకు బాల్య వివాహాలు చేయవద్దన్నారు. గృహ హింస, పోక్సో చట్టాలను గురించి వివరించారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ సెంటర్-1లో బుధవారం పౌష్టికాహార వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వారోత్సవాల్లో జమ్మలమడుగు ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ సునీత, అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం చాలా అవసరమన్నారు. అలాగే కిశోర బాలికలను రక్తహీనత నుంచి కాపాడేందుకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతిరోజు గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీ సెంటర్లలో అందించే బాలసంజీవని, ఇతర పదార్థాలు ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు అనిత, సరస్వతి, కుమారి, అశ్విని, బాలింతలు, గర్భిణీలు, కిశోర బాలికలు హాజరయ్యారు.

ప్రొద్దుటూరు..: పోషక విలువలు గల ఆహారం తోనే తల్లులు, బిడ్డలు ఆరోగ్యంగా వుండగలరని ఐసీడీఎస్ రూరల్ సీడీపీవో అరుణ కుమారి పేర్కొంది. బుధవారం ఐసిడిఎస్ రూరల్ ప్రాజెక్టు పరిధిలోని ఆర్అండ్‌బీ బంగ్లా సెంటర్‌లో పౌష్టికాహార ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో రూరల్ ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కళావతి, ఈశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా దేవాంగపేట సెక్టార్‌లో పౌష్టికాహార మాసోత్సవం ఐసీడీఎస్ అర్బన్ సూపర్‌వైజర్ బాగ్యలక్ష్మీ ఆధ్వర్యంలో చేపట్టారు.

ఎస్ఆర్‌బీసీ కెనాల్ పెండింగ్ పనులు పూర్తి చేయండి

జమ్మలమడుగు, సెప్టెంబరు 4: రైతులకు గుండెలాంటి ఎస్ఆర్‌బీసీ కెనాల్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని మైలవరం బీజేపీ నాయకులు కొమెర్ల రామలింగారెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం జమ్మలమడుగులోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఆర్‌బీసీ కెనాల్ పెండింగ్ పనులు 2014లో ఆగిపోయాయన్నారు. అప్పట్లో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి రైతులకు పెద్దముడియం, మైలవరం ప్రాంతాల రైతులకు కాలువలు పూర్తి చేయాలని ప్రయత్నం చేశారన్నారు. అప్పటి నుంచి అక్కడ పనులు నిలిచిపోయాయని వైసీపీ హయాంలో కాలువల పనులు పట్టించుకోలేదన్నారు. అవుకు రిజర్వాయర్ నుంచి పెద్దముడియం మండలం కొండసుంకేసుల, మైలవరంలోని అనేక గ్రామాలకు ఎస్ఆర్‌బీసీ ద్వారా సాగునీరు అందుతుందన్నారు. దీంతో మైలవరంలోని బెస్తవేముల, కల్లుట్ల, నవాబుపేట, గొల్లపల్లె, జి.ఉప్పలపాడు తదితర గ్రామాల అయిదు వేల ఎకరాల్లో రైతులకు సాగునీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురుశేఖర్‌రెడ్డి, చిదిపిరాళ్ల దిన్నె బాష, మైసూర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.